# చింత

చింత ఉష్ణమండలపు పంట. నిస్సారమైన భూముల్లో, తక్కువ వర్షపాతం గల మెట్ట ప్రాంతాల్లో కూడా సాగుచేయవచ్చు. ఇది బహుళ ప్రయోజనకారిణి. చింత పండు, చింత గింజలు, లేత ఆకులు, బెరడు, వేర్లు పలు విధాలుగా మనిషి అవసరాలకు ఉపయోగపడతాయి. ఇటీవల కాలంలో చింత గింజలకు కూడా గిరాకీ పెరుగుతూ వుంది. పొట్టు తీసిన చింత గింజల పౌడర్‌ను పశువుల దాణాగాను, కాఫీ పొడి, రంగుల తయారీ, వస్త్ర పరిశ్రమల్లోనూ ఉపయోగిస్తారు.

**రకాలు:** పి.కె.యం.-1, ప్రతిష్టాన్, ఉరిగమ్, డి.యస్.-1, డి.యస్.-2, యోగేశ్వర్ మొదలగునవి. చింతలో తీపి మరియు ఎరుపు కండ గల రకాలు కూడా ఉన్నాయి.

**నర్సరీ తయారీ:** విత్తనాలను జనవరి-ఫిబ్రవరి నెలల్లో సేకరించుకొని ఒక సంవత్సరం వరకు నిల్వ ఉంచుకోవచ్చు. కిలో బరువుకు 1800 నుండి 2000 గింజలుంటాయి. విత్తనాలను చల్లని నీటిలో 24 గంటలు నానబెట్టి 5×9 సంచుల్లో నాటాలి. వారం రోజుల్లో విత్తనం మొలకెత్తుతుంది. ఫిబ్రవరిలో విత్తినట్లయితే జూలై నెలకు మొక్కలు నాటటానికి సిద్ధంగా ఉంటాయి. విత్తనం ద్వారా వచ్చే మొలకలు కాపు రావడానికి 10-14 సంవత్సరాలు పడుతుంది. అంట్లు నాటడం మంచిది. అంటు మొక్కలు 4-7 సంవత్సరాల్లో కాపు కొస్తాయి.

**నాటేసమయం:** జూన్-జూలై మాసాలు అనుకూలం. నీరున్న చోట్ల సెప్టెంబరు వరకు నాటుకోవచ్చు.

**నాటటం:** ఎకరాకు 40 (10 మీ. × 10 మీ.) నుండి 60 (8మీ. × 8 మీ.) మొక్కలు వరకు నాటుకోవచ్చు. చింత రోడ్ల ప్రక్కన అయితే 10మీ-12 మీ. ఎడంలో నాటుకోవాలి. ఒక సంవత్సరం వయసు కలిగిన మొక్కలను రోడ్ల వెంట వర్షాకాలం మొదట్లో నాటాలి.

**అంతరకృషి:** మొక్కలు పెట్టే ముందు నేలను లోతుగా దున్నుకోవాలి. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో లోతుగా దున్నినట్లయితే కలుపు నివారణేగాక వర్షపు నీరు భూమిలో నిలువ ఉండి మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

**నీటి యాజమాన్యం:** నీరువున్న ప్రదేశాలలో మొదట వేసవికాలంలో మొక్కలకు 3 వారాలకొకసారి నీటి తడి ఇవ్వాలి. మొక్కలు నాటిన మొదటి 2-3 సంవత్సరాలు నీటి వసతి తప్పక కల్పించాలి.

**అంతర పంటలు:** మొదటి 4,5 సంవత్సరాల వరకు వ్యవసాయ పంటలు లాభసాటిగా పెంచుకోవచ్చు. చెట్లు బాగా పెరిగాక పశుగ్రాస పైర్లను పెంచుకోవచ్చు.

**పూత మరియు కాపు:** పూత ఏప్రిల్ నుండి ప్రారంభమై జూలై నెల వరకు పూస్తుంది. పరపరాగ సంపర్కం వల్ల పిందె కడ్తుంది. పూత నుండి కాయ పండే వరకు పట్టు కాలం 8-10 నెలలు.

**దిగుబడి:** 7-8 సంవత్సరాల చెట్టు నుండి 30-40 కిలోలు, 15వ సం. నుండి అధిక దిగుబడి (80-90 కిలోలు/చెట్టుకి) వస్తుంది. 20 సంవత్సరములు పైబడిన చెట్లు 200 కిలోలు పైగా దిగుబడినిస్తాయి. చెట్లు రెండు సంవత్సరములకొకసారి చొప్పున 80 సంవత్సరాలు కాస్తుంది.

**పురుగులు-తెగుళ్ళు:** కాయతొలిచే పురుగులు, ఆకుతినే పురుగులు, పిండినల్లి, ఇతర రసంపీల్చే పురుగులు ఆశిస్తాయి. తెగుళ్ళలో ఆకుమచ్చ తెగులు మరియు బూడిద తెగులు ముఖ్యమైనవి. వీటి ఉనికిని గమనించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

చింత సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా
**సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, ఉద్యాన పరిశోధనా స్థానం,**
అశ్వారావుపేట, ఖమ్మం జిల్లా. ఫోన్: 08740-200241